క్లుప్తంగా

ప్రపంచ సాహిత్య వేదికకు శ్యామల ఎంపిక



తాడికొండ: ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానా ప్రపంచ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే ప్రపంచ సాహిత్య వేదికకు ప్రముఖ కవయిత్రీ, తాడికొండ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఎంబీడీ శ్యామలకు ఆహ్వానం అందింది. ఈ నెల 29న వర్చువల్‌గా అంతర్జాలంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా పాల్గొనేందుకు తనకు అవకాశం కలగడం సంతోషంగా ఉందని ఆమె తెలిపారు.

పశువైద్యశాలకు చేరిన సంచార ఆరోగ్యసేవ వాహనం



ఫిరంగిపురం: మారుమూల గ్రామాల్లో పశువులకు వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్యసేవ వాహనం పశువైద్యశాలకు శనివారం చేరినట్లు ఏడీ శ్రీనివాసరావు తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటికే ఒక వాహనం అందుబాటులో ఉందని చెప్పారు. మేడికొండూరు, ఫిరంగిపురం మండలాలకు కలిపి మరో వాహనం అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. త్వరలో వాహనంలో వైద్యాధికారిని నియమించి అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన వివరించారు. పశువైద్యశాలకు చికిత్స కోసం పశువులను వాహనంలో తీసుకువెళ్లేందుకు వీలవుతుందని చెప్పారు.

ఘనంగా భావనాఋషి స్వామి కల్యాణం

ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు ప్రత్యేక పూజలు



మంగళగిరి: నగరంలోని షరాబ్‌బజారు రెండు రామమందిరాల వద్ద వేంచేసియున్న భద్రావతీ సమేత భావనాఋషి స్వామి వార్ల కల్యాణ మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. స్వామి వార్లను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవిలు హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణ మహోత్సవానికి నిర్వాహకులు శ్రీపద్మశాలీయ బహూత్తమ సేవా సంఘం వారితోపాటు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి తిలకించారు.

ముగిసిన ఖోఖో, కబడ్డీ పోటీలు



మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెం డాన్‌బాస్కో ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఖోఖో, కబడ్డీ క్రీడాపోటీలు శనివారంతో ముగిశాయి. పోటీలలో 14 ఉన్నత పాఠశాలల నుంచి 34 జట్లు పాల్గొన్నాయి. క్రీడాపోటీల్లో నిడమర్రు ఉన్నత పాఠశాలకు చెందిన బాలురు ఖోఖో జట్టు విన్నర్స్‌గా, చిర్రావూరు ఉన్నత పాఠశాల జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. కబడ్డీ పోటీల్లో చిర్రావూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జట్టు విన్నర్స్‌గానూ, పెనుమాక ఉన్నత పాఠశాలకు చెందిన జట్టు రన్నర్స్‌గానూ నిలిచింది. బాలికల ఖోఖో పోటీల్లో నిడమర్రు ఉన్నత పాఠశాల జట్టు విన్నర్స్‌గా, నవులూరు ఉన్నత పాఠశాల జట్టు రన్నర్స్‌గా నిలిచింది. ఫాదర్ చిన్నప్ప, ఫాదర్ జోస్, ఫాదర్ మర్రెడ్డి పాల్గొన్నారు.

పోస్టల్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

పోస్ట్‌మాస్టర్ జనరల్ సీడీఎస్‌వీఆర్ మూర్తి

మంగళగిరి: పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పోస్ట్‌మాస్టర్ జనరల్ సీడీఎస్‌వీఆర్ మూర్తి అన్నారు. నగరంలోని హెడ్ పోస్టాఫీస్ కార్యాలయంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ బి శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లతో సమావేశం నిర్వహించారు. మూర్తి మాట్లాడుతూ పోస్టల్ సిబ్బంది ప్రజలకు సత్వరమైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో గుంటూరు నార్త్ ఇన్‌స్పెక్టర్ కేఎస్‌వీ వెంకటరావు, మంగళగిరి పోస్ట్‌మాస్టర్ ఎంఎన్‌రెడ్డిలతోపాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

బోరు పంపునకు మరమ్మతులు

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని ప్రకాష్‌నగర్‌లో బోరు పంపునకు శనివారం మరమ్మతులు చేపట్టారు. పంపు పనిచేయడంలేదని స్థానిక మహిళలు ఎమ్మెల్యే ఆర్కేకు వాట్సాప్ మెసేజ్ పంపించారు. స్పందించిన ఆయన వివరాలు తెలుసుకుని కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి మరమ్మతులు చేయించారు.

కైలాసగిరి ఘాట్ రోడ్డు ప్రారంభం



ఘాట్ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, జెడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా, సురేష్‌కుమార్



శివలింగానికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి

మేడికొండూరు: మండలంలోని పేరేచర్ల వాసవి కన్యకా పరమేశ్వరి సహిత గంగా పార్వతి సమేత కైలాస నాథేశ్వరస్వామి (కైలాసగిరి) ఆలయం ఆధునికీకరణ పనులు స్థానిక జెడ్పీటీసీ సభ్యులు, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కందుల సిద్ధయ్య ఆధ్వర్యంలో చేపట్టారు. దీనిలో భాగంగా నిర్మించిన ఘాట్ రోడ్డును ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, తాడికొండ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్‌లు శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ భక్తులకు ఇది ఒక శుభపరిణామమని భావించాలన్నారు. రాష్ట్రంలోనే ఒక ప్రత్యేకమైన ప్రసిద్ధిగాంచిన దైవభక్త ఆత్మీయ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా మాట్లాడుతూ కొండపైన శైవక్షేత్రంలో నిత్య అన్నాదాన పథకం ప్రారంభం కావడం హర్షించదగ్గ అంశమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి కొండపైన గర్భగుడిలో శివలిగానికి పలురకాల అభిషేకాలు చేసి, దైవదర్శనం చేసుకున్నారు. తాడికొండ నియోజకవర్గంలో కైలాసగిరి శైవక్షేత్రం ఉండటం ఒక వరంగా భావిస్తున్నామని అన్నారు. ప్రత్యేక పూజల్లో మేడికొండూరు ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్ దంపతులు, గ్రామసర్పంచ్ దేవరకొండ రాజ్‌కుమార్‌లు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కారుమూరి వెంకటేశ్వరరావు, సాంబశివరావు, శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, వీరాంజనేయులు, ఉషాకుమార్, శివప్రసాదరావు, సిద్ధాంతి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గద్దం రాంబాబు, మస్తాన్‌వలి, షేక్ బాజి, జంద్రాసుపల్లి నాగేశ్వరరావు, కోక అర్జునరావు, బీవీ సుబ్బారెడ్డి, చంటి బాజి, దర్గామగ్బూల్, తమనంపల్లి శాంతయ్య, ఉడతా ప్రభాకర్, పలుకూరి వెంకటేశ్వర్లు, షేక్ షరీఫ్, రంగిశెట్టి బిట్టు, జగదీష్, నాగేశ్వరరావు, గాలీబ్ తదితరలు పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు

అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు



హోటల్‌లో స్వాధీనం చేసుకున్న నిషేధిత ప్లాస్టిక్ కవర్లు

మంగళగిరి: దుకాణదారులు నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు తప్పవని నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు హెచ్చరించారు. శనివారం నగరంలోని పలు దుకాణాలు, హోటళ్లలో తనిఖీలు నిర్వహించి నిషేధిత ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని జరిమానాలు విధించారు. 30కి పైగా దుకాణాలు, హోటళ్లలో తనిఖీలు నిర్వహించి సుమారు రూ.8వేల విలువైన 30 కేజీల ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. బిస్మిల్లా బిర్యానీ హోటల్‌లో అత్యధికంగా నిషేధిత ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని రూ. 5వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. నిరంతరం శానిటేషన్ సిబ్బంది నగరంలో తనిఖీలు నిర్వహించి నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ నియోకవర్గ విస్తృత స్థాయి సమావేశం

మంగళగిరి: నగరంలోని తెనాలి రోడ్డు ఫ్లై ఓవర్ పక్కన గల మార్కండేయ పద్మశాలి కల్యాణ మండపంలో ఆదివారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి పార్టీ రీజనల్ కోఆర్డినేటర్లు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, మర్రి రాజశేఖర్, పరిశీలకులు నిమ్మకాయల రాజనారాయణ, ఎమ్మెల్సీ, జిల్లా పార్టీ అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవితోపాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. సమావేశానికి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు



పెనుమాకలో సూర్యప్రభపై ఊరేగుతున్న శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి



రథసప్తమి సందర్భంగా సూర్య నమస్కారాలు చేస్తున్న విద్యార్థులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని పెనుమాకలో వేంచేసి ఉన్న కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం రథ సప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఐదు గంటలకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సప్తవాహన సేవ కార్యక్రమం, సూర్య ప్రభ వాహనంతో మొదలై చంద్రప్రభ వాహనంతో సేవలు ముగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పలు ఆలయాల్లో రథసప్తమి పూజలు

ఫిరంగిపురం: మండలంలోని పలు ఆలయాల్లో రథసప్తమిని పురస్కరించుకొని శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఫిరంగిపురంలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకులు నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణలు విశేష పూజలు చేశారు. 113తాళ్లూరులోని వేణుగోపాలుడి ఆలయంలో అర్చకులు ప్రసన్నమూర్తిస్వామి, ఉత్సవ మూర్తులకు అర్చనలు నిర్వహించారు. పొనుగుపాడులోని పద్మావతి అలివేలు మంగాసమేత వేంకటేశ్వర స్వామికి అర్చకులు శ్రీనివాసాచార్యులు అష్టోత్తర సహస్రనామపూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

విజ్ఞాన విహారలో...

మంగళగిరి: నగరపరిధిలోని నూతక్కి విజ్ఞాన విహార ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సామూహిక సూర్య నమస్కారాలు చేసి పూజలు నిర్వహించారు. పాఠశాల సెక్రటరీ వేణుగోపాల్‌నాయుడు హాజరై రథసప్తమి గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కోశాధికారి చెరుకుపల్లి ఆదిశేషావతారంతోపాటు పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లిఫ్ట్ వైర్ తెగి తండ్రీకొడుకులకు గాయాలు



చికిత్స పొందుతున్న చంటి

తాడేపల్లిరూరల్: ఉండవల్లి సెంటర్ సాంబశివ భవన్‌లో శనివారం లిఫ్ట్ వైర్ తెగడంతో లిఫ్ట్‌లో ఉన్న తండ్రీ కొడుకులకు తీవ్ర గాయాలయ్యాయి. సేకరించిన వివరాల ప్రకారం.. ఉండవల్లి సెంటర్‌లో నివాసం ఉండే చంటి ఇస్త్రీ చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఉండవల్లి సెంటర్ గెస్ట్‌హౌస్ రోడ్‌లో ఉన్న సాంబశివ భవన్‌లో ఇస్త్రీ బట్టలు ఇచ్చేందుకు కొడుకుతో కలిసి వెళ్లాడు. లిఫ్ట్‌లో ఎక్కి నాల్గవ అంతస్తుకు వెళుతుండగా రెండో ఫ్లోర్‌కు వెళ్లగా లిఫ్ట్‌వైర్ తెగి కిందకు పడిపోయింది. ఈ సమయంలో లిఫ్ట్‌లో ఉన్న చంటికి, ఆయన కుమారుడు యశ్వంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అపార్ట్‌మెంట్‌లో నివాసముండే వారు గాయాలపాలైన తండ్రీకొడుకులకు వైద్యం నిమిత్తం విజయవాడ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. లిఫ్ట్ రెండు రోజుల నుంచి మరమ్మతుల్లో ఉండి స్విచ్ ఆన్‌చేసి ఉండడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. అపార్ట్‌మెంట్ కమిటీ సభ్యుల అశ్రద్ధ వల్లే ఈ ఘటన చోటుచేసుకుందని చంటి బంధువులు ఆరోపిస్తున్నారు. వైద్యానికి డబ్బులు కూడా లేవని బాధితుల బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆలయం తొలగించకుండా రోడ్డు విస్తరణ చేపట్టాలి

మంగళగిరి: నగరంలోని రాజీవ్ గృహకల్ప రోడ్డు వెంబడి గల శ్రీకాళీమాత ఆలయాన్ని తొలగించకుండా రోడ్డు విస్తరణ చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. రోడ్డు విస్తరణలో భాగంగా నగరపాలక సంస్థ అధికారులు శనివారం ఆలయ మెట్లు తొలగించగా బీజేపీ నాయకులు చేరుకుని ఆందోళన నిర్వహించారు. అనంతరం నగరపాలక సంస్థ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జగ్గారపు శ్రీనివాసరావు, ఆలయ నిర్వాహకులు తమ్మిశెట్టి వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుంచనపల్లిలో రోడ్డు విస్తరణకు సన్నాహాలు

పరిశీలించిన డిప్యూటీ సిటీ ప్లానింగ్ అధికారులు



ప్రధాన రహదారిని పరిశీలిస్తున్న డీఈ కృష్ణారెడ్డి, టౌన్ ప్లానింగ్ డిప్యూటీ సిటీ ప్లానర్ మహాలక్ష్మి

తాడేపల్లిరూరల్: మంగళగిరి –తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని రహదారుల విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీనిలో భాగంగా కార్పొరేషన్ అధికారులు కుంచనపల్లిలోని ప్రధాన రహదారిని శనివారం పరిశీలించారు. ప్రాతూరు, కుంచనపల్లి రోడ్డు నుంచి సచివాలయం వరకు ఉన్న రహదారి ఆక్రమణలకు గురై ఇరుకుగా ఉండడంతో సుమారు 800 మీటర్ల పొడవున సీసీ రోడ్ నిర్మించాలని నిర్ణయించారు. దానిలో భాగంగా కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి టౌన్ ప్లానింగ్ డిప్యూటీ సిటీ ప్లానర్ మహాలక్ష్మి దొర ఆధ్వర్యంలో పరిశీలించారు. రోడ్డు ఆక్రమించుకున్న వారు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. అసిస్టెంట్ సర్వేయర్ వెంకటేశ్వర్లు, సచివాలయ ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పెదపరిమిలో కో ఆపరేటివ్ సొసైటీ భవనం ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీదేవి



కో ఆపరేటివ్ సొసైటీ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, నాయకులు

పెదపరిమి(తాడికొండ): సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం సేవలు అందిస్తుందని తాడికొండ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామంలో నూతనంగా నిర్మించిన నెక్కల్లు కో ఆపరేటివ్ సొసైటీ భవనాన్ని ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రైతుల కోసం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు ఇంటివద్దకే చేరువ చేయడంతోపాటు రైతు భరోసా సాయం అందిస్తూ అన్ని విధాలా ఆదుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో కో ఆపరేటివ్ సొసైటీలు నిర్వీర్యమై రైతులకు అందుబాటులో ఉండేవి కావని, కానీ నేడు దానికి భిన్నంగా సహకార రంగం ద్వారా రైతులకు రుణాలు, ఎరువులు, పురుగు మందులు అందిస్తూ చేరువ అవుతున్నాయన్నారు. అన్నదాతల సంక్షేమానికి అన్ని విధాలా పాటుపడుతున్న జగనన్న సహకార సొసైటీల సేవలను మరింత చేరువ చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కొండవీటి రాజేష్, పార్టీ మండల అధ్యక్షుడు మాదల మహేంద్ర, సీనియర్ నాయకులు నంబూరు రఘునాథరావు, నంబూరు బాబురావు, సొసైటీ డైరెక్టర్‌లు బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, మేళం వెంకటేశ్వర్లు, దొండపాడు సొసైటీ చైర్మన్ కొమ్మినేని అప్పారావు, గంటా దశరథరామారావు, దావులూరి పోతురాజు, మాజీ ఉప సర్పంచ్ అక్కల లక్ష్మీనారాయణరెడ్డి, ఆలూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య హృదయ స్తోత్ర పారాయణ



తాడేపల్లిరూరల్: రథసప్తమి సందర్భంగా తాడేపల్లి పట్టణ పరిధి సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై చిన్నజీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో భక్తులచే ఆదిత్య హృదయ స్తోత్ర పారాయణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మంగళ శాసనం పలికారు. విజయకీలాద్రి దివ్యక్షేత్ర 6వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బేరిపూజ, దేవత ఆహ్వానం, సామూహిక లక్ష్మీనారాయణ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు, రాఘవాచార్యులు, జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ వేద విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శ్యామల కోటిరెడ్డికి డాక్టరేట్



ఏషియా వేదిక్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకుంటున్న కోటిరెడ్డి

తాడికొండ: తాడికొండ మండలం రావెల గ్రామానికి చెందిన శ్యామల కోటిరెడ్డికి ఏషియన్ వేదిక కల్చర్ వర్సిటీ డాక్టరేట్ లభించింది. స్వగ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు, సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టినందుకుగాను ఆయన డాక్టరేట్‌కు ఎంపికయ్యారు. శనివారం బెంగళూరులోని హోసూరులో ఏషియా వేదిక్ కల్చర్ యూనివర్సిటీలో జరిగిన డాక్టరేట్‌ల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన యూనివర్సిటీ అతిథుల చేతుల మీదుగా డాక్టరేట్ స్వీకరించారు. స్వగ్రామంలో తాను చదువుకున్న పాఠశాల విద్యాభివృద్ధికి పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో రూ.60 లక్షలతో అభివృద్ధి చేయడం, పలుమార్లు రక్తదాన శిబిరాలు నిర్వహించడం, ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందించడం వంటి పలు సేవా కార్యక్రమాలు ఆయన నిర్వహించారు. దీనితో పాటు వేమన కళా పరిషత్ ఆధ్వర్యంలో సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం, కళాకారులను సత్కరించి మరుగున పడిపోయిన కళా సంస్కృతిని వెలికితీసేందుకు విశేష కృషి చేసినందుకుగాను ఆయనకు ఈ డాక్టరేట్ లభించింది. ఆయన మాట్లాడుతూ తనకు ఈ అవార్డు లభించడం సంతోషంగా ఉందని, దీంతో తనకు బాధ్యత మరింత పెరిగిందని, భవిష్యత్తులో ప్రజలకు ఉపయోగపడే మరికొన్ని కార్యక్రమాలు నిర్వహించి సమాజాభివృద్ధికి తనవంతు పాటుపడతానన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట వేమన కళా పరిషత్ ఉపాధ్యక్షుడు ధర్మారెడ్డి మిత్ర బృందం పాల్గొన్నారు.

విద్యుత్ ఉత్పత్తిపై పరిశోధనలు అభినందనీయం

కేఎల్‌యూలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు



రసాయనిక పరిశోధకులను సత్కరిస్తున్న విద్యార్థి వ్యవహారాల డీన్ కె.ఆర్.ఎస్.ప్రసాద్

తాడేపల్లిరూరల్: మొక్కల ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం ద్వారా బొగ్గు గనుల తవ్వకాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కేఎల్ విశ్వవిద్యాలయం రసాయనిక శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు అన్నారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అంతర్జాతీయ కెమిస్ట్రీ సదస్సు శనివారంతో ముగిసింది. పలువురు ప్రముఖులు మాట్లాడుతూ కొన్ని రకాల మొక్కలను పెంచి వాటిని ప్రక్రియ చేయడం ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చని తెలిపారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ అల్కా కాంబ్లే మాట్లాడుతూ సహజ వాయువులతో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నామని తెలియజేశారు. ఇథనాల్, మిథనాల్‌తోపాటు ఆల్కహాల్‌తో విద్యుత్ ఉత్పత్తి ఇప్పటికే జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ చాన్స్‌లర్ డాక్టర్ కెఎస్ జగన్నాథరావు, ప్రొ వీసీ డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, ఇతర అధ్యాపకులతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కళాశాల అభివృద్ధికి తోడ్పండి



సమావేశంలో పాల్గొన్న పూర్వ విదార్థులతో యూనివర్సిటీ అధికారులు, అధ్యాపకులు

పూర్వ విద్యార్థులకు వీసీ సూచన

ఏఎన్‌యూ: విలువైన సూచనలు, సలహాలు ఇచ్చి ఇంజినీరింగ్ కళాశాల అభివృద్ధికి తోడ్పడాలని పూర్వ విద్యార్థులకు వీసీ ఆచార్య పి. రాజశేఖర్ సూచించారు. డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ చదివిన కళాశాల, యూనివర్సిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావడం ప్రతి విద్యార్థి బాధ్యతగా భావించాలని చెప్పారు. ఇంజినీరింగ్ కళాశాలకు పూర్వ విద్యార్థులే బ్రాండ్ అంబాసిడర్లని తెలిపారు. ఉద్యోగంలో ప్రతిభ కనబరిచి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని, ప్రస్తుత విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఇంజినీరింగ్ కళాశాల అభివృద్ధికి యూనివర్సిటీ నుంచి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి. సిద్ధయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో మరింత నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఇంక్యుబేషన్ సెంటర్లు, ఇంటలెక్చ్యువల్ ప్రాపర్టీ రైట్స్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. బిగ్‌డేటా ఎనలటిక్స్, శాటిలైట్ డేటా ఎనాలసిస్ సెంటర్ ద్వారా ఆదర్శవంతమైన పరిశోధనలు జరుగుతున్నాయని వివరించారు. యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల సంఘం డైరెక్టర్ ఆచార్య జీవీఎస్ఆర్ ఆంజనేయులు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు పని చేసే సంస్థల ద్వారా యూనివర్సిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఇంజినీరింగ్ డీన్ ఆచార్య ఈ. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఉపాధి అవకాశాలు విరివిగా ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకునే నైపుణ్య లక్షణాల్ని విద్యార్థులు పెంపొందించుకోవాలని తెలిపారు. పూర్వ విద్యార్థుల సంఘ సమావేశ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎండీ తౌసీఫ్, పలువురు అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వీధిలైట్లు ఏర్పాటు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని కొలనుకొండలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో శనివారం కొత్తగా వీధిలైట్లు ఏర్పాటు చేశారు. కొలనుకొండ గంగానమ్మపేట నుంచి జాతీయ రహదారి సర్వీస్‌రోడ్ వరకు గతంలో వీధిలైట్లు లేకపోవడం, ఆ రహదారిలో ప్రయాణించేవారు రాత్రి సమయంలో ఇబ్బందులు గురికావడంతో ఎమ్మెల్యే ఆర్కేకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే ఆర్కే కార్పొరేషన్ విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 16 వీధిలైట్లను ఏర్పాటు చేసినట్లు క్రాంతి తెలిపారు.

చకచకా గ్రావెల్ ఫిల్లింగ్

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి ప్రజలకు కృష్ణాజలాలు అందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే రెండు ప్రాంతాల్లో తొమ్మిది ఎంఎల్‌డి సామర్థ్యం గల 6 ప్రెజర్ ట్యాంకర్లు ఏర్పాటు చేశారు. కృష్ణానది నుంచి తీసుకున్న తాగునీటిని శుద్ధి చేసేందుకు శనివారం గ్రావెల్ ఫిల్లింగ్ కార్యక్రమం చేపట్టారు. గుండురాళ్లు, నీటిని శుద్ధి చేసే వేళం, ఇతర రాళ్లను కలిపి లేయర్ల వారీగా ట్యాంకర్లలో నింపుతున్నట్లు ఏఈ కిషోర్ తెలిపారు.

బీసీ కులాల వారీగా జనగణన చేపట్టాలి

నెహ్రూనగర్: దేశవ్యాప్తంగా బీసీ కులాల వారీగా జనగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పాల రాజ్‌కిరణ్ డిమాండ్ చేశారు. చుట్టుగుంటలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలు రాజ్యాధికారం దిశగా అడుగులు వేస్తేనే న్యాయం జరుగుతుందని తెలిపారు.